నవంబర్‌లో యాక్షన్ షురూ



'దేవర' విజయంతో మంచి జోష్‌మీద ఉన్నారు తారక్. ఈ ఊపులోనే బాలీవుడ్ 'వార్ 2'ను కూడా చకచకా కానిచ్చేస్తున్నారు. ఈ సినిమాలో ఆయన నెగిటివ్ షేడ్స్ ఉన్న స్పైగా కనిపించనున్నట్టు బీటౌన్ సమాచారం. ఇదిలావుంటే.. ఈ సినిమా తర్వాత ప్రశాంత్‌నీల్ సినిమాను పట్టాలెక్కించనున్నారు తారక్. రీసెంట్‌గా హైదరాబాద్‌లోని రామానాయుడు స్టూడియోలో గప్‌చుప్‌గా ఈ సినిమా పూజాకార్యక్రమాలు జరిగాయి. లిమిటెడ్ పీపుల్ మాత్రమే ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. తాజా అప్‌డేట్ ప్రకారం నవంబర్ చివర్లో ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కానున్నట్టు తెలుస్తున్నది. అందుకు తగ్గ ఏర్పాట్లలో ప్రశాంత్‌నీల్ బిజీగా ఉన్నారట. కానీ తారక్ మాత్రం సంక్రాంతి తర్వాత ఈ షూటింగ్‌లో పాల్గొంటారని సమాచారం. 'వార్ 2'ని ముగించి, ప్రశాంత్‌నీల్ సినిమాకు సంబంధించిన లుక్‌లోకి మారడానికి ఈ మధ్య సమయాన్ని కేటాయించనున్నారు ఎన్టీఆర్. 2026 జనవరి 9న, సంక్రాంతి కానుకగా ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్టు ప్రశాంత్‌నీల్ ఇప్పటికే ప్రకటించారు.

నిర్మాతగా రెండో చిత్రం

అగ్ర కథానాయిక సమంత ట్రాలాల పేరుతో ప్రొడక్షన్ హౌజ్‌ను ప్రారంభించిన విషయం తెలిసిందే. 'మా ఇంటి బంగారం' పేరుతో తొలి చిత్రాన్ని తెరకెక్కిస్తున్నది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్‌లో ఉండగానే మరో సినిమాను మొదలుపెట్టింది. 'సినిమాబండి' ఫేమ్ ప్రవీణ్ కాండ్రేగుల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో సమంత కథానాయికగా నటించనుంది. పూర్తి వినోదాత్మకంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారు. ఇప్పటికే రెండు వారాల పాటు షూటింగ్ జరిగిందని, తదుపరి షెడ్యూల్‌ను వైజాగ్‌లో ప్లాన్ చేస్తున్నారని సమాచారం. సమంత ప్రధాన పాత్రలో నటించిన 'సిటాడెల్-హనీ బన్ని' సిరీస్ నవంబర్ 7నుంచి అమెజాన్ ప్రైమ్‌లో స్ట్రీమింగ్‌కు సిద్ధమవుతున్నది.

లొకేషన్స్ వేటలో..

మహేష్‌బాబు కథానాయకుడిగా రాజమౌళి దర్శకత్వంలో ఓ యాక్షన్ అడ్వెంచర్ మూవీ తెరకెక్కబోతున్న విషయం తెలిసిందే. వచ్చే ఏడాది జనవరిలో సెట్స్‌మీదకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా ప్రీప్రొడక్షన్ దశలో ఉంది. ఈ నేపథ్యంలో దర్శకుడు రాజమౌళి సోషల్‌మీడియాలో పంచుకున్న ఓ ఫొటో వైరల్‌గా మారింది. దీనికి 'కనుగొనడం కోసం తిరుగుతున్నా' అనే క్యాప్షన్ జత చేశారు రాజమౌళి. ఆఫ్రికాలోని అడవుల్లో ఆయన లొకేషన్ సెర్చ్ కోసం వెళ్లినట్లు తెలుస్తున్నది. అమెజాన్ ఫారెస్ట్ నేపథ్యంలో అడ్వెంచరస్ యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారు. ఈ సినిమా కోసం మహేష్‌బాబు సరికొత్త మేకోవర్‌తో సిద్ధమవుతున్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో రూపొందించనున్న ఈ చిత్రం కోసం విదేశీ సాంకేతిక నిపుణులు కూడా పనిచేయబోతున్నారు. 'ఆర్ఆర్ఆర్' తర్వాత రాజమౌళి రూపొందించబోతున్న ఈ సినిమాపై దేశవ్యాప్తంగా ఆసక్తినెలకొని ఉంది. దుర్గా ఆర్ట్స్ పతాకంపై కె.ఎల్.నారాయణ ఈ చిత్రాన్ని నిర్మించబోతున్నారు.

పవర్‌ఫుల్ బుల్లెట్

స్టార్ కొరియోగ్రాఫర్, నటుడు రాఘవ లారెన్స్, ఆయన తమ్ముడు ఎల్విన్ ప్రధానపాత్రధారులుగా ఇన్నాసి పాండియన్ దర్శకత్వంలో రూపొందుతోన్న అడ్వంచర్ మూవీకి 'బుల్లెట్ బండి' అనే టైటిల్‌ని ఖరారు చేశారు. కతిరేసన్ ఈ చిత్రానికి నిర్మాత. మంగళవారం లారెన్స్ పుట్టినరోజు సందర్భంగా ఈ మూవీ టైటిల్, ఫస్ట్‌లుక్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఈ ఫస్ట్‌లుక్‌లో లారెన్స్ స్టయిలీష్‌గా డైనమిక్ పోలీస్ ఆఫీసర్ గెటప్‌లో కనిపిస్తున్నారు. స్టయిట్ తెలుగు సినిమాగా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో సునీల్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ చిత్రానికి కెమెరా: అరవింద్ సింగ్, సంగీతం: సామ్ సి.ఎస్. నిర్మాణం: ఫైవ్‌స్టార్ క్రియేషన్స్.

200కోట్ల భారీ బడ్జెట్‌తో..

రమేష్‌వర్మ దర్శకత్వంలో లారెన్స్ నటిస్తున్న యాక్షన్ అడ్వంచరస్ చిత్రానికి 'కాలభైరవ' అనే టైటిల్ ఖరారు చేశారు. కోనేరు సత్యనారాయణ నిర్మాత. ఇది హీరోగా లారెన్స్ 25వ చిత్రం కావడం విశేషం. లారెన్స్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా టైటిల్ పోస్టర్‌ని, ఫస్ట్‌లుక్‌ని మేకర్స్ విడుదల చేశారు. 'ది వరల్డ్ విత్ ఇన్', 'ఏ ప్యాన్ ఇండియా సూపర్‌హీరో ఫిల్మ్' వంటి లైన్స్ ఫస్ట్‌లుక్‌లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. 200కోట్ల భారీ బడ్జెట్‌తో పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నామని, నవంబర్ నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించి, వచ్చే ఏడాది వేసవిలో సినిమాను విడుదల చేస్తామని నిర్మాత తెలిపారు.

ఫ్యామిలీ ఆడియెన్స్ ఆదరిస్తున్నారు

''లగ్గం' చిత్రానికి అద్భుతమైన ఆదరణ లభిస్తోంది. కుటుంబ సమేతంగా చూడదగిన మంచి చిత్రమని ప్రేక్షకులు ప్రశంసిస్తున్నారు. కుటుంబ అనుబంధాలు, భావోద్వేగాల గురించి ఈ సినిమాలో గొప్పగా చూపించాం' అన్నారు నిర్మాత వేణుగోపాల్ రెడ్డి. ఆయన నిర్మాతగా రమేష్ చెప్పాల దర్శకత్వంలో రూపొందించిన 'లగ్గం' చిత్రం ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చింది. సాయిరోనాక్, ప్రగ్యా నగ్రా జంటగా నటించారు. మంగళవారం సక్సెస్‌మీట్‌ను నిర్వహించారు. నేటి రోజుల్లో ప్రతి ఒక్కరూ కంప్యూటర్ ఇంజనీర్ అల్లుడిగా కావాలని కోరుకుంటున్నారని, ఇదొక సమస్యగా మారిందని, ఈ అంశాన్ని సినిమాలో సందేశాత్మకంగా తెలియజెప్పారని సీనియర్ నటుడు రాజేంద్రప్రసాద్ అన్నారు. విడుదలైన అన్ని కేంద్రాల్లో మంచి స్పందన లభిస్తున్నదని, మళ్లీమళ్లీ చూసే విధంగా ఉందని, ప్రేక్షకుల నుంచి ప్రశంసలు వస్తున్నాయని దర్శకుడు రమేష్ చెప్పాల తెలిపారు. చక్కటి కుటుంబ కథా చిత్రంలో భాగం కావడం ఆనందంగా ఉందని హీరోహీరోయిన్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.

ఏ భాషలోనైనా విజయం తథ్యం

' 'క' కథ కిరణ్ అబ్బవరం ద్వారానే నా దగ్గరకు వచ్చింది. వినగానే కంటెంట్ కొత్తగా అనిపించింది. స్క్రిప్ట్ ఈ సినిమాకు ప్రధానబలం. దర్శకులు సుజీత్, సందీప్ బాగా రాసుకున్నారు. అంతకంటే బాగా తీశారు. విడుదలకు ముందే సినిమాపై మంచి బజ్ వచ్చింది. మా టీమ్‌కు మంచి అవకాశాలు కూడా వస్తున్నాయ్. నిర్మాతగా నాకు సంతృప్తినిస్తున్న విషయం ఇది.' అన్నారు నిర్మాత చింతా గోపాలకృష్ణారెడ్డి. ఆయన నిర్మించిన చిత్రం 'క'. కిరణ్ అబ్బవరం కథానాయకుడు. సుజీత్, సందీప్ దర్శకులు. ఈ నెల 31న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం నిర్మాత చింతా గోపాలకృష్ణారెడ్డి విలేకరులతో ముచ్చటించారు. ' 'క' కోసం కిరణ్ అబ్బవరం చాలా శ్రమించాడు. మే నెలలో డబుల్ కాల్‌షీట్ వర్క్ చేశాడు. ఉదయం 5గంటలకు సెట్‌కి వచ్చేవాడు. రాత్రి 12 వరకూ షూటింగ్ చేసేవాడు. మళ్లీ ఉదయం 5గంటలకు లొకేషన్లో ఉండేవాడు. డైరెక్టర్లు కూడా ఎక్కడా రాజీ పడలేదు. ప్రతి షాట్ రిచ్‌గా ఉండాలని శ్రమించారు. చివరి నిమిషం వరకూ సినిమాకోసం కష్టపడ్డారు. దాంతో నిర్మాతగా నేను పెద్ద టెన్షన్ ఫీలవ్వలేదు. ఇటీవలే అవుట్‌పుట్ చూశాను. చాలా బాగా వచ్చింది. ఈ సినిమాకు సీక్వెల్ కూడా చేయొచ్చు. రెండు తెలుగురాష్ట్రాల్లో 350 థియేటర్లకు పైగా సినిమాను విడుదల చేస్తున్నాం. ఒకేసారి అన్ని భాషల్లో విడుదల చేయలేకపోతున్నామనే బాధ లేదు. ఈ సినిమా ఎప్పుడు ఏ భాషలో విడుదలైన 'కాంతార' లాగా బ్లాక్‌బస్టర్ అవుతుందని నా నమ్మకం.' అని చెప్పారు. ప్రస్తుతం శివలెంక కృష్ణప్రసాద్ నిర్మిస్తున్న 'సారంగపాణి జాతకం' సినిమాకు కో ప్రొడ్యూసర్‌గా చేస్తున్నానని, మా సంస్థ నుంచి కొత్త ప్రాజెక్ట్‌ని జనవరిలో ఫైనల్ చేస్తానని గోపాలకృష్ణారెడ్డి తెలిపారు.

అదృష్టం వరించేది ధైర్యాన్నే

సత్యదేవ్, డాలీ ధనుంజయ లీడ్‌రోల్స్ చేస్తున్న యాక్షన్ ఎంటర్టైనర్ 'జీబ్రా'. 'లక్ ఫేవర్స్ ది బ్రేవ్' అనేది ఉపశీర్షిక. ఈశ్వర్ కార్తీక్ దర్శకుడు. ఎస్.ఎన్.రెడ్డి, ఎస్.పద్మజ, బాల సుందరం, దినేష్ సుందరం నిర్మాతలు. మంగళవారం ఈ సినిమా రిలీజ్ డేట్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. నవంబర్ 22న సినిమా విడుదల కానున్నట్టు పోస్టర్ ద్వారా మేకర్స్ తెలిపారు. ఈ పోస్టర్‌లో సత్యదేవ్, డాలీధనుంజయ్ ఉద్వేగంగా కనిపిస్తున్నారు. కరెన్సీ నోట్లు, లైట్‌హౌస్, ఫ్యాక్టరీ మొదలైన ఎలిమెంట్స్ బ్యాగ్రౌండ్‌లో కనిపిస్తున్నాయి. సత్యరాజ్, సునీల్, ప్రియా భవానీశంకర్, సత్య అక్కల, జెన్నిఫర్ పిషినోటా తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి మాటలు: మీరాఖ్, కెమెరా: సత్య పొన్మార్, సంగీతం: రవి బస్రూర్, నిర్మాణం: పద్మజ ఫిల్మ్స్ ప్రై.లిమిటెడ్, ఓల్డ్ టౌన్ పిక్చర్స్.

అమ్మోరు తల్లి నేపథ్యంలో..

సతీష్‌బాబు రాటకొండ హీరోగా నటిస్తూ, దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'జాతర'. రాధాకృష్ణారెడ్డి, శివశంకర్ రెడ్డి నిర్మాతలు. నవంబర్ 8న ప్రేక్షకుల ముందుకురానుంది. మంగళవారం చిత్ర ట్రైలర్‌ను నిర్మాత రాజ్ కందుకూరి విడుదల చేశారు. 'అమ్మోరు తల్లి ఊరు వదిలి వెళ్లిపోయిందహో' అంటూ దండోరాతో మొదలైన ట్రైలర్ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. విజువల్స్, యాక్షన్ ఘట్టాలు ఆకట్టుకున్నాయి. చిత్తూరు జిల్లా బ్యాక్‌డ్రాప్‌లో జాతర నేపథ్యంలో నడిచే కథాంశమిదని, యాక్షన్ డ్రామాగా మెప్పిస్తుందని చిత్రబృందం పేర్కొంది. దీయారాజ్, ఆర్.కె.నాయుడు, గోపాల్ రెడ్డి తదితరులు నటించిన ఈ చిత్రానికి కెమెరా: కెవీ ప్రసాద్, సంగీతం: శ్రీజిత్ ఎడవణ, రచన-దర్శకత్వం: సతీష్‌బాబు రాటకొండ.

జగత్తుకు అంతుపట్టని రహస్యం

రాకేష్ గలేబి, స్రవంతి పత్తిపాటి, మానసవీణ, భార్గవ్ గోపీనాథం ముఖ్యతారలుగా రూపొందిన సైన్స్‌ఫిక్షన్ అండ్ మైథలాజికల్ థ్రిల్లర్ 'రహస్యం ఇదం జగత్'. కోమల్ ఆర్.భరద్వాజ్ దర్శకుడు. పద్మ రావినూతుల, హిరణ్య రావినూతుల నిర్మాతలు. నవంబర్ 8న సినిమా విడుదల కానుంది. మంగళవారం హైదరాబాద్‌లో ఈ చిత్రం ట్రైలర్ లాంచ్ కార్యక్రమం జరిగింది. ప్రముఖ దర్శకుడు చందు మొండేటి ఈ కార్యక్రమానికి అతిథిగా విచ్చేసి ట్రైలర్‌ని ఆవిష్కరించారు. 'నాకిష్టమైన అంశాలన్నీ ఈ ట్రైలర్‌లో ఉన్నాయి. నిజంగా చాలా ఎగ్జయిట్ అయ్యాను. టెక్నాలజీకి అంతపట్టని వామ్‌హోల్ కాన్సెప్ట్ నేపథ్యంలో ఈ సినిమా చేసినట్టు అనిపిస్తుంది. ఇలాంటి సినిమా తీయడం చాలా కష్టం. ప్రస్తుతం జనాలు ఇలాంటి సినిమాలనే ఇష్టపడుతున్నారు.' అని చందు మొండేటి అన్నారు. ఓ అందమైన చందమామ కథలా సినిమా ఉంటుందని, గొప్ప థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చే సినిమా ఇదని, ప్రచార చిత్రాలకు అనూహ్యమైన స్పందన వస్తున్నదని, సినిమా అంతకు మించి ఉంటుందని దర్శకుడు నమ్మకం వ్యక్తం చేశారు. ఇంకా చిత్రబృందం ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.